# కైవల్యోపనిషత్తు

## ( అధర్వణ వేదం )


వ్యాఖ్యాత

" అభినవ వ్యాస " , " జ్ఞాన ప్రపూర్ణ "

శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc(Ag)

వ్యవస్థాపకులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం : : చిలకలూరిపేట

visit - www.srichalapathirao.com

Contact : +91 80085 39770 / 08647 254716
+91 98862 65225

# శ్రీ గురుభ్యో నమః

# కైవల్యోపనిషత్తు - అధర్వణ వేదం

## శాంతి మంత్రము

మం॥ ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః ।
భద్రం పశ్యేమాక్ష భిర్య జత్రాః ।
స్థిరై రంగైస్తుష్టువాంసస్తనూభిః వ్యశేమ దేవహితం యదాయుః ।
స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః । స్వస్తినః పూషా విశ్వవేదాః ।
స్వస్తి నస్తార్ క్ష్యో అరిష్టనేమిః । స్వస్తినో బృహస్పతిర్దధాతు
ఓం శాంతిః శాంతిః శాంతిః ||

ప్రతి ॥ ఓం = నిరాకార నిర్గుణ పరమాత్మ; దేవాః = దేవతలారా; కర్ణేభిః = మా చెవులతో; భద్రం = మంగళకరమైన శబ్దాలను; శ్రుణయామ = వినెదము గాక; యాజత్రా = పూజింపదగిన దేవతలారా; అక్షభిః = మా కన్నులతో; భద్రం = మంగళకరమైన దృశ్యాలనే; పశ్యేమ = చూచెదను గాక; స్థిరైః అంగైః = దృఢమైన అవయవాలతో; తనూభిః = ఆరోగ్యంగా ఉండి; తుష్టువాంసః = మిమ్ము స్తుతిస్తూ; యదాయుః = ఆయుష్షు ఉన్నంతవరకు; దేవహితం = దైవకార్యాలను చేస్తూ; వ్యశేమ = జీవించెదము గాక; వృద్ధశ్రవాః = అధిక కీర్తి గల వాడైన; ఇంద్రః = ఇంద్రుడు; నః స్వస్తి = మాకు శుభమును కలిగించుగాక; విశ్వ వేదాః = సర్వము తెలిసిన వాడైన; పూషా = సూర్యుడు; నః = మాకు; స్వస్తి = శుభమును కలిగించు గాక; అరిష్టనేమితార్క్ష్య = వేగముగా పోయే గరుడుడు; నః స్వస్తి = మాకు శుభమును కలిగించుగాక; బృహస్పతి = బృహస్పతి; నః స్వస్తి = మాకు శుభమును; దధాతు = కలిగించుగాక; ఓం శాంతిః శాంతిః శాంతిః = ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక తాపములు శాంతించుగాక!

తాత్పర్యము :- ఓ దేవతలారా! మేము సదా మంగళకరమైన వాక్కులనే విందుము గాక ! కళ్ళతో సదా మంగళకరమైన విషయములనే చూచెదముగాక, ధృడమైన అవయవాలతో ఆరోగ్యంగా ఉండి మిమ్ము స్తుతిస్తూ మాకు విధించిన ఆయుష్కాలం వరకు జీవించెదముగాక. పురాతనుడు ప్రసిద్ధుడు, అధిక కీర్తి గలవాడు అయిన ఇంద్రుడు, సర్వమును తెలిసిన సూర్యుడు (పూషా); మిక్కిలి వేగము గల గరుడుడు, మాలోని ఆధ్యాత్మిక సంపదను రక్షించే బృహస్పతి వీరందరు మాకు విషయమును గ్రహించగల బుద్ధి కౌశల్యమును, వాటిని అనుసరించగల గుండె ధైర్యమును ఇచ్చి అనుగ్రహింతురు గాక. ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక తాపములు శాంతించుగాక!

## మొదటి మంత్రము

**మం** ॥ అధాశ్వలాయనో  భగవంతం పరమేష్టినముపసమేత్యోవాచ -

**ప్రతి** ॥ అధ = అంతట; ఆశ్వలాయనః = అశ్వలాయనుడు! భగవంతం = భగవంతుడైన; పరమేష్టినం = బ్రహ్మను; ఉపసమేత్య = సమీపించి; ఉవాచ = పలికెను.

**తాత్పర్యం :**

అటుపిమ్మట (అనగా సాధన చతుష్టయ సంపత్తిని పొందిన వెనుక) అశ్వలాయనుడు భగవంతుడైన బ్రహ్మదేవుని సమీపించి ఇట్లు పలికెను.

## రెండవ మంత్రము

**మంత్రం** ॥ తస్మై సహోవాచ పితామహశ్చ -
శ్రద్ధాభక్తి ధ్యానయోగాదవైహి ॥

**ప్రతి** ॥ తస్మై = అతనికి; సః = అతడు; ఉవాచహ = చెప్పెను కదా; పితామహః = పితామహుడు; చః = మరియు; శ్రద్ధా భక్తి ధ్యానయోగాత్ = శ్రద్ధా భక్తి ధ్యాన యోగముల ద్వారా; అవైహి = తెలుసుకొనుము.

**తాత్పర్యము** ॥ అప్పుడు పితామహుడైన బ్రహ్మదేవుడు ఆశ్వలాయనునకు ఇట్లు చెప్పెను. (ఆ బ్రహ్మ విద్య ను) దానిని శ్రద్ధా భక్తి ధ్యాన యోగముల ద్వారా తెలుసుకొనుము.

## మూడవ మంత్రము

మంత్రము ॥ న కర్మణా నప్రజయా ధనేన
త్యాగే నైకేన అమృతత్వ మానశుః ।
పరేణ నాకం నిహితం గుహాయాం
విభ్రాజతే యద్యతయో విశంతి ॥

ప్రతి ॥ న కర్మణా = కర్మతో కాదు; న ప్రజయా = సంతానముతో కాదు; న ధనేన = ధనముతో కాదు; త్యాగేన ఏకేన = ఒక్క త్యాగముతోనే; అమృతత్వం = అమృతత్వమును; అనశుః = పొందగలరు; పరేణనాకం = స్వర్గమును మించి; నిహితం గుహాయాం = బుద్ధి

గుహాలో ఉంచబడినదై; యత్ విభ్రాజతే = ఏది ప్రకాశిస్తున్నదో; యతయః = యతీశ్వరులు; విశంతి = పొందుచున్నారు.

**తాత్పర్యము** :- కర్మ చేత గాని, సంతానము చేత గాని, ధనము చేత గాని కాక కేవలం త్యాగము ద్వారానే అమృతత్వమును పొందగలరు. స్వర్గమునకు పరమై, హృదయ గుహాలో ప్రకాశిస్తూ ఉన్న ఆ పరమాత్మను ఆత్మ సంయమనం గల యతీశ్వరులు చేరగలరు.

## నాలుగవ మంత్రము

**మం** ॥ వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః
సన్యాస యోగాద్యతయః శుద్ధ సత్త్వాః ।
తే బ్రహ్మ లోకేషు పరాన్తకాలే
పరామృతాత్ పరిముచ్యన్తి సర్వే ॥

**ప్రతి** ॥ వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః = వేదాంత జ్ఞాన విషయమై నిశ్చితమైన అర్థమును తెలుసుకొనినవారై; సన్యాస యోగాత్ = సన్యాస యోగము ద్వారా; యతయః = యతీశ్వరులు; శుద్ధసత్త్వాః = పరిశుద్ధమైన మనస్సు గల; తే = వారు; బ్రహ్మలోకేషు = బ్రహ్మ లోకమందు; పరాన్తకాలే = బ్రహ్మ ప్రళయ కాలంలో; పరామృతాత్ = పరమైన అమృతత్వస్థితినందుకొనుట వలన; పరిముచ్యంతి = ముక్తిని పొందుచున్నారు; సర్వే = అందరు.

**తాత్పర్యము** ॥ పరిశుద్ధమైన అంతః కరణమగలవారై; సన్యాస యోగముద్వారా వేదాంత విషయములను విజ్ఞానము చేత విశదంగా తెలుసుకొని నిశ్చితార్థులైన యతీశ్వరులు అందరు

బ్రహ్మ ప్రళయ కాలం వరకు బ్రహ్మ లోకమందు ఉండి పరాన్త కాలమందు విముక్తులై ఆ అమృతత్వ స్థితిని అందుకొంటున్నారు.

## ఐదవ మంత్రము

మంత్రము ॥ వివిక్తదేశే చ సుఖాసనస్థః శుచిః
సమగ్రీవ శిరః శరీరః ।
అత్యాశ్రమస్థః సకలేంద్రియాణి నిరుధ్య
భక్త్యా స్వగురం ప్రణమ్య
హృత్పుండరీకం విరజం విశుద్ధం
విచిన్త్య మధ్యే విశదం విశోకం ॥

ప్రతి ॥ వివిక్తదేశే = ఏకాంత ప్రదేశమందు, సుఖానస్థః = సుఖాసనాసీనుడై, శుచిః = శుచియై, సమగ్రీవశిరః శరీరః = మెడను శిరస్సును శరీరమును సమంగా ఉంచుకొని, అత్యాశ్రమస్థః = సన్యాస భావంతో, సకలేంద్రియాణి = సమస్త ఇంద్రియములను, నిరుధ్య = నిరోధించి, భక్త్యా = భక్తితో, స్వగురం = తన గురువును, ప్రణమ్య = నమస్కరించి, హృత్ పుండరీకం = హృదయ పద్మము యొక్క, విరజం = నిర్మలినము, విశుద్ధం = పరిశుద్ధం, విచింత్య = ధ్యానించి, మధ్యే = మధ్యన, విశదం = విశదమైనది, విశోకం = శోకము లేనిది.

**తాత్పర్యము:-** ఏకాంత ప్రదేశమందు సుఖాసనా సీనుడై, మెడ, శిరస్సు, శరీరములను తిన్నగా సమంగా నిలిపి, శుచియై, సన్యాస భావంతో, సమస్త ఇంద్రియములను నిరోధించి, భక్తితో తన గురువుకు మనసుతో నమస్కరించి హృత్ పుండరీక మధ్యంలో నిర్మలినము,

విశుద్ధము, విశదము, విశోకము అయిన దానిని ధ్యానించి; అట్టి స్థితిని పొందటానికి సాధన ఎలా చేయాలి? -

## ఆరవ మంత్రం

**మంత్రము** ॥ అచింత్య మవ్యక్త మనన్తరూపం
శివం ప్రశాంత మమృతం బ్రహ్మయోనిం ।
తదాది మధ్యాన్త విహీన మేకం
విభుం చిదానంద మరూప మద్భుతం ॥

**ప్రతి** :- అచింత్యం = చింతింప వీలుగానిది; అవ్యక్తం = వ్యక్తం కానిది; అనంతరూపం = అనంతమైన రూపము గలది; శివం = శుభమైనది; ప్రశాంతం = ప్రశాంతమైనది; అమృతం = మార్పు లేనిది; బ్రహ్మయోనిం = బ్రహ్మ పుట్టుకకు కారణమైనది, తదా = అదేవిధంగా; ఆదిమధ్యాన్త విహీనం = ఆది మధ్య అంతములు లేనిది; ఏకం = ఏకమైనది; విభుం = సర్వవ్యాపి అయినది; చిదానందం = చిదానంద స్వరూపము; అరూపం = రూపము లేనిది; అద్భుతం = అద్భుతమైనది.

**తాత్పర్యము** :- అచింత్యము, అవ్యక్తము, అనంతమైన రూపముగలది; శుభకరమైనది; ప్రశాంతము, అమృత రూపము; బ్రహ్మకు కూడా కారణమైనది; ఆది మధ్యంత రహితము, ఏకము, సర్వవ్యాపి, చిదానందము, అరూపము, అద్భుతము.

## ఏడవ మంత్రము

**మంత్రము** ॥ ఉమాసహాయం పరమేశ్వరం ప్రభుం
త్రిలోచనం నీలకంఠం ప్రశాంతం।
ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూతయోనిం
సమస్త సాక్షిం తమసః పరస్తాత్॥

**ప్రతి** ॥ ఉమా సహాయం = ఉమతో కూడిన వానిని, పరమేశ్వరం = పరమేశ్వరుని, ప్రభుం = ప్రభువును, త్రిలోచనం = త్రినేత్రుని, నీలకంఠం = నీలకంఠుని, ప్రశాంతం = శాంతమైన వానిని, ధ్యాత్వా = ధ్యానించి, మునిః = ముని, భూతయోనిం = భూతములకు కారణమైన వానిని, సమస్త సాక్షిం = సమస్తమునకు సాక్షియైన వానిని, తమసః పరస్తాత్ = పెను చీకటికి ఆవల ఉండువానిని; గచ్ఛతి = పొందుచున్నాడు.

**తాత్పర్యము**:- ఉమతో కూడినవాడు, ప్రభువు, ప్రశాంతుడు, త్రిలోచనుడు, నీలకంఠుడు అయిన పరమేశ్వరుని ధ్యానించి, ముని అయినవాడు ప్రపంచ సృష్టికి కారణమై పెను చీకటి కవ్వలనుండు ఆ సర్వ సాక్షిని చేరు కుంటున్నాడు.

## ఎనిమిదవ మంత్రము

**మం**॥ స బ్రహ్మా స శివః సేంద్రః సో 2 క్షరః పరమః స్వరాట్ ।
స ఏవ విష్ణుః స ప్రాణః స కాలో 2 గ్నిః స చంద్రమాః ॥

**ప్రతి**॥ స =అతడు, బ్రహ్మ = బ్రహ్మ, సః = అతడు, శివః = శివుడు, సః = అతడు, ఇంద్రః = ఇంద్రుడు, సః = అతడు, అక్షరః = నాశనము లేనివాడు, పరమః స్వరాట్ = పరమప్రకాశకుడు , స ఏవ = అతడే, విష్ణుః = విష్ణువు, సః = అతడు, ప్రాణః = ప్రాణము, సః = అతడు, కాలః = కాలము, అగ్నిః = అగ్ని, సః = అతడు, చంద్రమాః = చంద్రుడు.

**తాత్పర్యము**:- అతడే బ్రహ్మ, అతడే శివుడు, అతడే ఇంద్రుడు, అతడు నాశనము లేనివాడు, పరమ స్వరాట్, అతడే విష్ణువు, అతడు ప్రాణము, అతడు కాలము, అగ్ని చంద్రుడు కూడనై యున్నాడు.

## తొమ్మిదవ మంత్రం

**మంత్రము**॥ స ఏవ సర్వం యద్ భూతం యచ్చభవ్యం సనాతనం ।
జ్ఞాత్వాతం మృత్యుమత్యేతి నాన్యః పంథా విముక్తయే

**ప్రతి**॥ సః ఏవ = అతడే; సర్వం = సమస్తము; యత్ భూతం = ఏది భూత కాల మందుండెనో; యత్ = ఏది; భవ్యం = భవిషత్తులో ఉండునో; సనాతనం = సనాతనమైనదో ; తం = దానిని; జ్ఞాత్వా = తెలుసుకొని; మృత్యుం = మృత్యువును; అత్యేతి = తరించుచున్నాడు; విముక్తయే = ముక్తికి; న అన్యః పంథా = మరియొక మార్గము లేదు.

**తాత్పర్యము**:- భూతకాలమందు ఏది ఉండెనో భవిష్యత్కాలమందు ఏది ఉండగలదో, అది ఆ పరమాత్మే. ఆ పరమాత్మ సనాతనమైనది. అట్టి నిత్య తత్త్వమైన పరమాత్మను తెలుసుకొని మృత్యువును అధిగమిస్తున్నాడు. ముక్తికి ఇంతకంటే మరొక మార్గం లేదు.

## పదియవ మంత్రము

**మంత్రము**॥ సర్వ భూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని।
సంపశ్యన్ బ్రహ్మ పరమం యాతి నాన్యేన హేతునా॥

**ప్రతి**॥ సర్వభూతస్థం = సర్వ భూతములయందున్న వానిగా; ఆత్మానం = తనను, సర్వ భూతాని = సమస్త భూతములు; ఆత్మనిచ = తన యందును; సంపశ్యన్ = చూచుచున్నవాడై; పరమం బ్రహ్మ = పరబ్రహ్మను, యాతి = చేరుచున్నాడు; అన్యేన హేతునా = ఇతర కారణముల చేత; న = కాదు.

**తాత్పర్యము**:- సమస్త భూతములను తన యందు, తనను సమస్త భూతముల యందును చూచువాడు ఆ పరమాత్మను చేరుచున్నాడు. మరొక మార్గమేదీ లేదు.

## పదకొండవ మంత్రము

**మంత్రము**॥ ఆత్మానం అరణిం కృత్వా ప్రణవం చోత్తరారణిం ।
జ్ఞాన నిర్మధ నాభ్యాసాత్ పాశం దహతి పండితః ॥

**ప్రతి**॥ ఆత్మానం = తన ఆత్మను; అరణిం = అరణిగా; కృత్వా = చేసి; ప్రణవంచ = ప్రణవమును; ఉత్తరారణిం = ఉత్తరారణిగా; జ్ఞాన నిర్మధనాభ్యాసాత్ = జ్ఞానమును మదించే అభ్యాసము వలన; పాశం = పాశమును; దహతి = దహించుచున్నాడు; పండితః = పండితుడు.

**తాత్పర్యము**:- జీవాత్మ భావమును క్రింది అరణిగాను ప్రణవమును ఉత్తరారణిగాను చేసి జ్ఞాన మార్గమందు మ థించి అభ్యాసము చేసిన పండితుడు ఆ జ్ఞానం ద్వారా సమస్త బంధములను దహింప చేయుచున్నాడు.

## పన్నెండవ మంత్రం

**మంత్రము**॥ స ఏవ మాయా పరిమోహితాత్మా
శరీరమాస్థాయ కరోతి సర్వం
స్త్రియన్న పానాది విచిత్ర భోగైః
స ఏవ జాగ్రత్ పరితృప్తి మేతి ॥

**ప్రతి**॥ సః ఏవ = అతడే, మాయా పరిమోహితాత్మా = మాయామోహితుడై, శరీరం = శరీరంలో, ఆస్థాయ = ఉండి, కరోతి = చేయుచున్నాడు, సర్వం = సర్వమును, స్త్రీ, అన్నపానాది విచిత్రభోగైః = స్త్రీ, అన్నపానములు మొదలైన నానావిధ భోగములతో, స ఏవ = అతడే, జాగ్రత్ = జాగ్రదావస్థలో, పరితృప్తిం = సంతృప్తిని, ఏతి = పొందుచున్నాడు.

**తాత్పర్యము**:- ఆ ఆత్మే మాయామోహితమై ఈ శరీరంలో ప్రవేశించి జీవుడిగా సమస్త కార్యములను చేయుచున్నది. జాగ్రదావస్థలో ఆ జీవుడే స్త్రీ, అన్న, పానాది విచిత్రమైన వివిధ భోగములను అనుభవించి సంతృప్తిని పొందుచున్నాడు.

## పదమూడవ మంత్రము

**మంత్రము** ॥ స్వప్నే స జీవః సుఖ దుఃఖభోక్తా
స్వమాయయా కల్పిత జీవలోకే ।
సుషుప్తికాలే సకలే విలీనే
తమో 2 భిభూతః సుఖరూపమేతి ॥

**ప్రతి** ॥ స్వప్నే = స్వప్నమందు, సజీవః = ఆ జీవుడు, సుఖదుఃఖ భోక్తా = సుఖదుఃఖములనుభవించువాడు, స్వమాయయా = తన మాయచేత, కల్పిత జీవలోకే = కల్పించుకొన్న జీవలోకమందు, సుషుప్తికాలే = సుషుప్తి కాలములో, సకలేవిలీనే = సమస్తము లీనమైపోగా, తమః = తమస్సుచేత, అభిభూతః =ఆవరింపబడినవాడై, సుఖరూపం = సుఖరూపమును, ఏతి = పొందుచున్నాడు.

**తాత్పర్యము** :- ఆ జీవుడే స్వప్నమందు తన మాయతో కల్పించుకొన్న జీవ లోకంలో సుఖ దుఃఖాలను అనుభవించుచున్నాడు. సుషుప్త్యవస్థలో సర్వము విలీనమైనప్పుడు తమస్సుచే ఆవరింపబడి సుఖరూపంలో ఉంటున్నాడు.

## పదునాలుగవ మంత్రము

**మంత్రము** : పునశ్చ జన్మాంతర కర్మయోగాత్
స ఏవ జీవః స్వపితి ప్రబుద్ధః ।
పురత్రయే క్రీడతి యశ్చ జీవః
తతస్తు జాతం సకలం విచిత్రం ॥
ఆధారమానంద మఖండబోధం
యస్మిన్ లయం యాతి పురత్రయం చ ||

**ప్రతి** ॥ పునః చ = మరల; జన్మాంతర కర్మయోగాత్ = జన్మాంతర మందలి కర్మ ఫలితంగా; స ఏవ జీవః = ఆ జీవుడే; స్వపితి = స్వప్నించుచున్నాడు; ప్రబుద్ధః = మేలుకొన్నవాడై; పురత్రయే = త్రిపురములందు; క్రీడతి = క్రీడించుచున్నాడు; యః
చ జీవః = ఏ జీవుడు; తతః తు = దానినుండే; జాతం = పుట్టినది; సకలం = సమస్తము; విచిత్రం = విచిత్రమైనది; ఆధారం = ఆధారమైనది; ఆనందం = ఆనందరూపమైనది; అఖండ బోధం = అఖండ బోధరూపము; యస్మిన్ = దేనియందు; లయం = లయమును; యాతి = చెందుచున్నదో; పురత్రయం చ = మూడు పురములను

**తాత్పర్యము** :- మరల ఆ జీవుడే పూర్వజన్మ కర్మవశాత్తు నిద్రించి మేల్కొన్నవాడు (ప్రబుద్ధుడు) అగుచున్నాడు. ఆ విధంగా పురత్రయమందు - మూడవస్థల్లో ఆ ఆత్మక్రీడించుచున్నది. ఆత్మనుండే విచిత్రమైన ఈ సకల జగత్తు ఉద్భవించినది. ఈ మూడవస్థలకు అతడే ఆధారము. అతడే అఖండ జ్ఞానస్వరూపుడు . అతనియందే ఈ మూడవస్థలు లయము పొందుచున్నవి.

## 15 వ మంత్రం

**మంత్రము** ॥ ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణి చ ।
ఖం వాయుర్జ్యోతిరాపః పృధ్వీ విశ్వస్య ధారిణీ ॥

**ప్రతి** ॥ ఏతస్మాత్ = దీనినుండి, జాయతే = పుట్టుచున్నది, ప్రాణః = ప్రాణము, మనః = మనస్సు, సర్వేంద్రియాణి చ = సమస్త ఇంద్రియములును, ఖం = ఆకాశము, వాయుః =

వాయువు, జ్యోతి = అగ్ని, ఆపః = నీరు, పృధ్వీ = భూమి; విశ్వస్య దారిణి = విశ్వమును ధరించునది.

**తాత్పర్యము**:- ఈ ఆత్మ నుండే ప్రాణము, మనస్సు, సర్వేంద్రియాలు, ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, విశ్వమును ధరించే భూమి, అన్నీ ఉద్భవించాయి.

## 16 వ మంత్రము

**మంత్రము॥** యత్పరం బ్రహ్మ సర్వాత్మా విశ్వస్యాయ తనం మహత్ ।
సూక్ష్మాత్ సూక్ష్మతరం నిత్యం తత్త్వమేవ త్వమేవ తత్॥

**ప్రతి॥** యత్ = ఏది; పరంబ్రహ్మ = పరబ్రహ్మమో; సర్వాత్మా = సర్వాత్మగా ఉందో; విశ్వస్య = విశ్వమునకు; మహత్ ఆయతనం = మహత్తరమైన ఆధారమో; సూక్ష్మాత్ = సూక్ష్మమైన దానికంటే; సూక్ష్మతరం = మిక్కిలి సూక్ష్మమైనదో; నిత్యం = నిత్యమైనదో; తత్ = అది; త్వమేవ = నీవే; త్వం ఏవ = నీవే; తత్ = అది.

**తాత్పర్యము:-** ఏది పరబ్రహ్మమో, ఏది సర్వమందు ఆత్మగా ఉందో, ఏది విశ్వమునకు మహత్తరమైన ఆధారమో, ఏది సూక్ష్మము కంటె సూక్ష్మమో, ఏది నిత్యమో అదే నీవు. నీవే అది.

## 17 వ మంత్రము

**మంత్రము** ॥ జాగ్రత్ స్వప్న సుషుప్త్యాది ప్రపంచం యత్ ప్రకాశతే ।
"తత్ బ్రహ్మాహ" మితి జ్ఞాత్వా సర్వబంధైః ప్రముచ్యతేః ॥

**ప్రతి** ॥ జాగ్రత్ స్వప్న సుషుప్త్యాది ప్రపంచం = జాగ్రత్, స్వప్నము, సుషుప్తి అను వీటితో కూడిన ప్రపం చాన్ని; యత్ = ఏది; ప్రకాశతే = భాసిస్తున్నదో; తత్ బ్రహ్మ అహం = ఆ బ్రహ్మను నేను; ఇతి = అని; జ్ఞాత్వా = తెలుసుకొని, సర్వబంధైః = సమస్త బంధముల నుండి; ప్రముచ్యతే = విడువబడుచున్నాడు.

**తాత్పర్యము** ॥ జాగ్రత్ స్వప్న సుషుప్తువులతో కూడిన ప్రపంచమును ఏదైతే భాసింప చేయుచున్నదో ఆ బ్రహ్మనే నేను అని తెలుసుకుంటే అతడు సమస్త బంధముల నుండి విముక్తుడగుచున్నాడు.

## 18 వ మంత్రము

**మంత్రము** ॥ త్రిషుధామసు యద్ భోగ్యం భోక్తా భోగశ్చ యద్భవేత్ ।
తేభ్యో విలక్షణః సాక్షీ చిన్మాత్రోయం సదాశివః ॥

**ప్రతి** ॥ త్రిషుధామసు = మూడు అవస్థలలోను, యత్ భోగ్యం = ఏది భోగ్యమో; భోక్తా = భోక్తయో; భోగః చ = భోగమును కూడా; యత్ భవేత్ = ఏది అగుచున్నదో, తేభ్య = వాటి నుండి; విలక్షణః = విలక్షణుడై; సాక్షీ = సాక్షియై; చిన్మాత్రః = చిత్ స్వరూపుడను; అహం = నేను; సదాశివః = సదాశివుడను.

**<u>తాత్పర్యము</u>**॥ మూడు అవస్థలలోను భోగ్యం; భోక్తా, భోగరూపంలో ఏదైతే ఉందీ దాని నుండి నేను విలక్షణుడను, సాక్షిని, చిత్ స్వరూపుడను, సదా శివుడను.(అని భావించవలెను)

## <u>19 వ మంత్రము</u>

**మంత్రము**॥ మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితం
మయి సర్వం లయం యాతి తద్ బ్రహ్మాద్వయమస్మ్యహం ।

**ప్రతి**॥ మయి ఏవ = నా యందే, సకలం జాతం = సమస్తమును పుట్టినది, మయి = నా యందు, సర్వం = సర్వము, ప్రతిష్ఠితం = ప్రతిష్ఠితమైనది, మయి సర్వం = నా యందే సర్వము, లయం యాతి = లయము పొందుచున్నది, తత్ = ఆ, బ్రహ్మ = బ్రహ్మమును, అద్వయం = అద్వయము, అస్మి = అగుచున్నాను, అహం = నేను.

**<u>తాత్పర్యము:-</u>** నా యందు సర్వము జనించి, నా యందే ప్రతిష్ఠితమై, నా యందే సర్వము లయము పొందుచున్నది, నేనే అద్వయమైన ఆ బ్రహ్మను.

## <u>20 వ మంత్రము</u>

**<u>మంత్రము</u>** ॥ అణోరణీయాన హమేవ తద్వత్
మహానహం విశ్వమహం విచిత్రం ।
పురాతనోహం పురుషోహమీశో
హిరణ్మయోహం శివరూపమస్మి ॥

**ప్రతి**॥ అణీః = అణువుకంటే; అణీయాన్ = సూక్ష్మమైన వాడను; అహం ఏవ = నేనే; తద్వత్ = అదేవిధంగా; మహాన్ = మహత్తును, అహం = నేను; విశ్వం= విశ్వమును; అహం = నేను; విచిత్రం = విచిత్రమైన; పురాతనః = పురాతనుడను; అహం = నేను; పురుషః = పురుషుడను; అహం = నేను; ఈశః = ఈశ్వరుడను; హిరణ్మయః = హిరణ్మయుడను; అహం = నేను; శివరూపం అస్మి = శివరూపుడను అయి ఉన్నాను.

**తాత్పర్యము:-** నేను అణువు కంటే అణువును. మహత్తుకంటే మహత్తును, విచిత్రమైన ఈ విశ్వమును నేను. నేను పురాతన పురుషుడను. నేను ఈశ్వరుడను, హిరణ్మయ రూపుడను. శివరూపుడను.

## 21 వ మంత్రం

**మంత్రము** ॥ అపాణిపాదోహమ చింత్య శక్తిః
పశ్యామ్య చక్షుః స శృణోమ్య కర్ణః ।
అహం విజానామి వివిక్తరూపో
న చాస్తి వేత్తా మమ చిత్సదాహం ॥

**ప్రతి** ॥ అహం = నేను; అపాణిపాదః = పాణిపాదములు లేనివాడను, అచింత్య శక్తిః = అచింత్యమైన శక్తి గలవాడను, అచక్షుః = కళ్ళు లేకుండా; పశ్యామి = చూచుచున్నాను, అకర్ణః = చెవులు లేకుండా; శృణోమి = వినుచున్నాను, అహం = నేను; వివిక్త రూపః = రూపము లేకనే; విజానామి = తెలుసుకుంటున్నాను, మమ = నన్ను; వేత్తా = తెలుసుకొనేవాడు, న అస్తి చ = లేనేలేడు; సదా = ఎల్లప్పుడు; అహం = నేను; చిత్ = జ్ఞానమును.

**తాత్పర్యము** :- నాకు పాణిపాదములు లేవు. నా శక్తి అచింత్యము, నేత్రములు లేకుండా చూచుచున్నాను. చెవులు లేకుండా వింటున్నాను. సమస్తమును తెలుసుకుంటున్నాను. నన్ను తెలుసుకొనేవాడు లేడు. నేను సదా చైతన్యరూపుడను.

## 22 వ మంత్రము

**మంత్రము** ॥ వేదైరనేకై రహమేవ వేద్యో
వేదాంతకృద్వే దవిదేవచాహం
నపుణ్య పాపే మమ నాస్తి నాశో
న జన్మ దేహేంద్రియ బుద్ధిరస్తి ॥

**ప్రతి** ॥ అనేకైః వేదైః = అనేక వేదముల చేత, అహం ఏవ = నేనే, వేద్య = తెలుసుకొనదగినవాడను, వేదాంతకృత్ = వేదాంతమును తెలియజెప్పిన వాడను, వేదవిత్ = వేదములను తెలిసినవాడను, అహం ఏవం = నేనే, మమ = నాకు, నపుణ్యపాపే = పుణ్యపాపములు లేవు, నాశః = నాశము, నాస్తి = లేదు, జన్మ దేహ ఇంద్రియ బుద్ధిః = జన్మ దేహ ఇంద్రియ భావము, న అస్తి = లేదు.

**తాత్పర్యము**:- సమస్త వేదముల చేత తెలియబడువాడను నేనే , వేదాంతములైన ఉపనిషత్తులను తెలియజేప్పినవాడను నేనే. వేద విదుడును నేనే. నాకు పుణ్యపాపములు లేవు. నాశనము లేదు. జన్మ లేదు. మనోభావము లేదు.

# 23- 24 మంత్రములు

**మంత్రము**॥ న భూమిరాపో న చ వహ్నిరస్తి

న చా 2 నిలో మే2స్తి న చాంబరం చ।

ఏవం విదిత్వా పరమాత్మ రూపం

గుహాశయం నిష్కల మద్వితీయం ॥ 23

సమస్త సాక్షిం సదసద్విహీనం

ప్రయాతి శుద్ధం పరమాత్మ రూపం ॥ 24

**ప్రతి**॥ న భూమిః = భూమి లేదు; ఆపః = నీరు; వహ్ని = అగ్ని; న అస్తి = లేదు; న చ అనిలః = గాలి లేదు; అంబరం చ = ఆకాశమున్ను; నమే ఆస్తి = నాకు లేదు; ఏవం విదిత్వా = ఈ విధంగా తెలుసుకొని; పరమాత్మ రూపం = పరమాత్మ రూపమును; గుహాశయం = హృదయ కుహరంలో ఉండు వానిని; నిష్కళం = కళలు లేని వానిని; అద్వీయం = రెండవది మరొకటి లేని దానిని; సమస్త సాక్షిం = సమస్తమునకు సాక్షి అయిన దానిని; సదసత్ విహీనం = సత్తు అసత్తులు రెండు కాని దానిని; ప్రయాతి = చేరుతున్నాడు; శుద్ధం = శుద్ధమైన; పరమాత్మ రూపం = పరమాత్మ రూపమును.

**తాత్పర్యము**:- నాకు భూమి, నీరు, అగ్ని, ఆకాశము, వాయువు ఏదీ లేదు. నిష్కళుడను, అద్వితీయుడను, సర్వసాక్షియు, సదసద్రహితుడునునగు పరమాత్మ యొక్క స్వరూపము నెరిగి ఆశుద్ధమగు పరమాత్మ రూపమునే పొందుచున్నాను.

## ద్వితీయ ఖండం

## మొదటి మంత్రం

**మం** ॥ యః శతరుద్రీయ మధీతే ।
సో 2 గ్ని పూతో భవతి ।
సురా పానాత్ పూతో భవతి ।
బ్రహ్మ హత్యాత్ పూతో భవతి ।
కృత్యా కృత్యాత్ పూతో భవతి ।
తస్మాద్ అవిముక్త మాశ్రితో భవతి ।
అత్యాశ్రామీ సర్వదా సకృత్వా జపేత్ ॥

**ప్రతి** ।। యః = ఎవడైతే; శతరుద్రీయం = శతరుద్రీయమును; అధీతే = అధ్యయనము చేస్తాడో; సః = అతడు; అగ్ని పూతో భవతి = అగ్ని పూతుడగుచున్నాడు. సురాపానాత్ = సురాపానము చేసిన పాపము నుండి; పూతో భవతి = పవిత్రుడగుచున్నాడు; బ్రహ్మ హత్యాత్ = బ్రహ్మ హత్యా పాతకము నుండి, పూతో భవతి = పవిత్రుడవుతున్నాడు; కృత్య అకృత్యాత్ = కృత్య(చేయదగిన)అకృత్య(చేయకూడని) పనులనుండి; పూతో భవతి = పవిత్రుడవుతున్నాడు; తస్మాత్ = అందువల్ల; అవిముక్తం = పరమాత్మను; ఆశ్రితో భవతి = ఆశ్రయించిన వాడవుతున్నాడు; అత్యాశ్రమీ = ఆశ్రమాలకు అతీతుడవుతున్నాడు; సర్వదా = ఎల్లప్పుడు; సకృత్ వా = లేదా ఒక్కసారైనా, జపేత్ = జపించాలి.

**తాత్పర్యము**:- ఎవడు ఈ శతరుద్రీయమును అధ్యయనము చేస్తాడో అతడు అగ్ని పూతుడగుచున్నాడు. సురాపానదోషము నుండి పవిత్రుడగుచున్నాడు.బ్రహ్మాహత్యా పాతకము నుండి పవిత్రుడగుచున్నాడు. కృత్య - అకృత్యముల నుండి విడుదల

పొందుతున్నాడు. అందువల్ల ఆ చైతన్య తత్త్వమును(పరమాత్మను) ఆశ్రయించిన వాడవుతున్నాడు. అన్ని ఆశ్రమాలకు అతీతుడై ఈ శతరుద్రీయమును సదా జపిస్తూ ఉండాలి. లేదా కనీసం రోజుకు ఒక్కసారైనా జపించాలి.

## ఫలశ్రుతి మంత్రం

**మం** ॥ అనేన జ్ఞాన మాప్నోతి
సంసారార్ణవ నాశనం.
తస్మాదేవం విదిత్వైనం
కైవల్యం ఫల మశ్నుతే ।
కైవల్యం ఫల మశ్నుతః ఇతి -

**ప్రతి** ॥ అనేన = దీనివల్ల; జ్ఞానం ఆప్నోతి = జ్ఞానాన్ని పొందుతాడు; సంసార ఆర్ణవ నాశనం = జనన మరణ రూప సంసార సాగరాన్ని తరిస్తాడు; తస్మాత్ = అందువల్ల; ఏవం = ఈ చెప్పిన విధంగా; ఏనం = దీనిని; విదిత్వా = తెలుసుకొని; కైవల్యం = మోక్ష రూపమైన; ఫలం = ఫలమును; అశ్నుతే = పొందగలుగుతాడు. కైవల్యం = మోక్ష రూపమైన; ఫలం = ఫలమును; అశ్నుతే = పొందగలడు; ఇతి = అని. ఇలా ఉపనిషత్తు.

**తా** ॥ ఈ ఉపనిషత్తును అధ్యయనం చేయుట వల్ల ఆత్మజ్ఞానాన్ని పొందుతాడు. ఈ జనన మరణ రూప సంసార సాగరాన్ని అవలీలగా తరిస్తాడు. అందువల్ల ఈ పైన చెప్పిన విధంగా ఈ ఉపనిషత్తును బుద్ధితో విచారణ చేసి తెలుసుకొని మోక్ష రూపమైన ఫలితాన్ని - అంటే కైవల్యాన్ని పొందాలి. కైవల్యమును(మోక్షమును) పొందగలడు. ఇలా ఉపనిషత్తు.